TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక: 99 గురువారం, ఆగస్టు 8, 2024 కంప్లిమెంటరీ కాపీ పేజీలు : 4

## ఆర్థిక బిల్లుకు...

# లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్‌పై ఇటీవలే ప్రవేశపెట్టిన నూతన మూలధన లాభాల పన్నును ప్రభుత్వం సడలించిన తరువాత ఆర్థిక బిల్లు 2024ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఈ సడలింపు వల్ల పన్ను చెల్లింపుదారులు కొత్త తక్కువ పన్ను రేటుకు మారడానికి లేదా ఇండెక్సేషన్ ప్రయోజనంతో అధిక రేటు గల పాత పన్ను విధానంతో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండానే రియల్ ఎస్టేట్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టిసిజి)ని 20 శాతం నుంచి 12 శాతానికి తగ్గించేందుకు తన 2024-25 బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆప్షన్ ఇచ్చేందుకు బిల్లుకు సవరణ ప్రవేశపెట్టారు. ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేసుకున్న తరువాత ఆస్తి ధరకు రావడానికి పన్ను చెల్లింపుదారులకు ఇండెక్సేషన్ ప్రయోజనం వీలు కల్పిస్తుంది. పన్ను విధింపును పెంచినందుకు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు లేనందుకు కొత్త నిబంధన విమర్శలకు గురైన తరువాత ఈ సవరణ చోటు చేసుకుంది. బిల్లులో తీసుకువచ్చిన ప్రధాన సవరణ జూలై 23కు ముందు కొన్న ఆస్తుల విక్రయంపై ఇండెక్సేషన్ ప్రయోజనం పునరుద్ధరణకు సంబంధించినది.

## ఏపీ హోం మంత్రితో...

# వైఎస్ సునీత భేటి



అమరావతి: వైఎస్ వివేకా కుమార్తె సునీత ఏపీ హోంమంత్రి అనితను నేడు అమరావతిలో కలిశారు. తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయాన్ని ఆమె మంత్రికి వివరించారు. వివేకా హత్య తదనంతర పరిణామాలను హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సమయంలో కేసును నీరుగార్చేలా వ్యవహరించారని పేర్కొన్నారు. సీబీఐ అధికారులపై తప్పుడు కేసుతో పాటు సాక్షులను బెదిరించారని సునీత హోంమంత్రికి వివరించారు. ఈ కేసు సీబీఐ విచారణలో ఉన్నందున ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని మంత్రి అనిత తెలిపారు. దోషులకు శిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

## చేనేతకు జీవం పోయండి

# పవన్ కల్యాణ్ పిలుపు



అమరావతి: చేనేతకు జీవం పోయాలని ఎపి ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు ఇచ్చారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రంగంపై ఆధారపడ్డ ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో అతిపెద్ద అసంఘటిత ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే రంగాల్లో చేనేత ఒకటి అని.. చేనేత ఒక కళాత్మకమైన పరిశ్రమ అని అన్నారు. ఏపీలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, ఎమ్మిగనూరు, వెంకటగిరి చేనేత వస్త్రాలకు ప్రతీకలు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలు అనే మాట ప్రజల్లో ఒక భావోద్వేగాన్ని నింపాయన్నారు. అలాంటి చేనేత రంగానికి జీవం పోయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు, ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుందని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సంవత్సరాల కిందటే చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ క్రమంలోనే నేత వస్త్రాలను ధరిస్తున్నానని వెల్లడించారు.

యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఈ రంగంపై ఆధారపడ్డవారికి ధీమా కలుగుతుందని పవన్ స్పష్టం చేశారు.

# మహిళలకు ఎన్డీఏ సర్కార్ గుడ్ న్యూస్




న్యూ ఢిల్లీ : ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలుకు కార్యాచరణ చేపట్టింది. లోక్ సభ ఎన్నికల ముందు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికల కోడ్ తో అప్పట్లో అప్లికేషన్లు స్వీకరించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా వీటిపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. విశ్వకర్మ లోన్ల మంజూరు కార్యాచరణ చేపట్టింది. వివిధ వృత్తుల వారికి యంత్రాలు, పనిముట్లు కొనుగోలు చేసేందుకు కేంద్రం ఆర్థికసాయం అందిస్తుంది.

**ఉచితంగా కుట్టు మిషన్లు**

మహిళలకు కుట్టు మిషన్ కొనుగోలు చేసేందుకు విశ్వకర్మ పథకంలో ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా కుట్టుమిషన్ కొనుక్కునేందుకు రూ .15000 అందిస్తారు. ఈ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో కేంద్రం జమచేస్తుంది. దీంతో పాటు ఒక వారం ట్రైనింగ్ ఇస్తారు. ట్రైనింగ్ సమయంలో రోజుకు రూ.500 చొప్పున చెల్లిస్తారు. కుట్టుమిషన్ కొనుగోలు తర్వాత అతి తక్కువ వడ్డీకి రూ.లక్ష రుణం అందిస్తారు. ఈ లోన్ ను 18 నెలల్లో తిరిగి చెలిస్తే, మరో రూ .2 లక్షల వరకు లోన్ పొందవచ్చు. దానిని 30 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కుట్టు మిషన్ కొనుక్కునే వారు షాప్ పెట్టుకోవడానికి కూడా కేంద్రం లోన్ ఇస్తుంది.

**వెరిఫికేషన్**

గతంలో కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇంటింటికి తిరిగి వెరిఫై చేస్తున్నారు. కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు ఎక్కడ నేర్చుకున్నారు, ట్రైనింగ్ తీసుకున్నారా? గతంలో లోన్లు తీసుకున్నారా? అనే వివరాలు సేకరిస్తున్నారు.

**దరఖాస్తు చేసుకునే విధానం**

ఉచిత కుట్టుమిషన్ల కోసం అప్లై చేసుకున్న వాళ్లు భారతీయులై ఉండాలి. ఇప్పటికే కుట్టుపనిలో అనుభవం కలిగి ఉండాలి. వయసు 18 ఏళ్లు పైబడి ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు, అడ్రస్ వివరాలు, గుర్తింపు కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నెంబర్ కలిగి ఉండాలి. ముందుగా https://pmvishwakarma.gov.in/ వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేయాలి. మీకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తెలియకపోతే దగ్గరలోని మీసేవ కేంద్రానికి వెళ్లి అప్లై చేసుకోవచ్చు.

# 12 రాజ్యసభ స్థానాలకు ఉపఎన్నికల ప్రకటన జారీ తెలంగాణ సహా

న్యూఢిల్లీ: రాజ్యసభ ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాలకు సిఈసి ప్రకటన జారీ చేసింది. తెలంగాణ నుంచి రాజ్యసభ ఎంపీ కేశవరావు రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానికి కూడా ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 3వ తేదీన ఉప ఎన్నికల పోలింగ్, అదే రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి లెక్కింపు. ఇక నామినేషన్ల ఉపసంహరణ ఆగస్టు 26,27న ఉండనున్నాయి. కెకె కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆయన ఖాళీ చేసిన సీటు కూడా కాంగ్రెస్ కే వచ్చేలా ఉంది. కాగా 12 రాజ్యసభ స్థానాల్లో 11 స్థానాలు ఎన్డీయే కూటమే దక్కించుకోనుందని తెలుస్తోంది.

**ఈ వార్త లక్షలాది మంది భారతీయుల హృదయాలను బద్దలు కొట్టింది, అయితే అనర్హతపై అప్పీల్ చేయడానికి అన్ని ఎంపికలను అన్వేషించాలని ప్రధాని నరేంద్ర మోడీ భారత ఒలింపిక్ సంఘాన్ని అభ్యర్థించారు. ఒక క్రీడాకారుడు ప్రాథమిక ప్రమాణాలను పాటించడంలో విఫలమైతే, ఈ కేసులో చర్చలకు చాలా తక్కువ మోచేతి గది ఉందని సోర్సెస్ చెప్పాయి. IOA ప్రెసిడెంట్ PT ఉషతో ప్రధాని మోదీ వ్యక్తిగతంగా మాట్లాడారు. ఈ విషయంపై ప్రత్యక్ష సమాచారం మరియు పరిష్కారానికి సంభావ్య మార్గాలను కోరింది.**

## రెజ్లింగ్ లో వినేశ్ ఫొగాట్ పై....

# అనర్హత వేటు!



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు ఎదురు దెబ్బ తగిలింది. మెడల్ అవకాశాలున్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై బరువు పెరిగిన కారణంగా అనర్హత వేటు పడింది. మహిళల 50 కిలోల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్ కు చేరిన సంగతి తెలిసిందే. దీంతో భారత్ కు పతకం ఆశలు గల్లంతయినట్లే. గోల్డ్ మెడల్ బౌట్ ఈవెంట్ కు చేరిన తొలి భారతీయ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ . ఆమె బరువు బుధవారం ఉదయం 100 గ్రాములు అధికంగా ఉండడంతో రూల్స్ ప్రకారం అనర్హత వేటు పడిందని ఇండియన్ కోచ్ తెలిపారు. "మహిళల రెజ్లింగ్ 50 కిలోల తరగతి నుండి వినేష్ ఫోగట్ అనర్హత వార్తలను భారత బృందం పంచుకోవడం విచారకరం. రాత్రిపూట జట్టు ఎంత ప్రయత్నించినప్పటికీ, ఆమె ఈ ఉదయం 50 కిలోల కంటే కొన్ని గ్రాముల బరువుతో ఉంది, "అని %xూూ% పేర్కొంది. "ఈ సమయంలో ఆగంతుకులు తదుపరి వ్యాఖ్యలు చేయరు. వినేష్ గోప్యతను గౌరవించాలని భారత జట్టు మిమ్మల్ని అభ్యర్థిస్తోంది. ఇది చేతిలో ఉన్న పోటీలపై దృష్టి పెట్టాలనుకుంటున్నది, "అని పేర్కొంది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ యుయి సుసాకిని ఆమె ఓడించింది.

## అది భారత్ పాలకులకు...

# గుణపాఠం

: మెహబూబా ముఫ్తీ



న్యూఢిల్లీ: నియంతృత్వ పాలన ఎక్కువ కాలం మనలేదని కశ్మీర్ కు చెందిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పిడిపి) చీఫ్ ముఫ్తీ మెహబూబా స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ లో చోటు చేసుకున్న పరిణామాలు భారత పాలకులకు గుణపాఠం వంటివని ఆమె అన్నారు. "యువతను అణచివేస్తే తిరుగుబాటు వస్తుంది. ద్రవ్యోల్బణం కట్టడి చేయకుండా, నిరుద్యోగాన్ని పరిష్కరించకుండా, ప్రజలను విద్యకు దూరం చేయాలని చూస్తే బంగ్లాదేశ్ మాదిరి పరిస్థితులు భారత్ లోనూ రావొచ్చు'' అని ఆమె అభిప్రాయపడ్డారు. "షేక్ హసీనా ఎదుర్కొన్న అనుభవాన్నే భారత పాలకులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయి"అని ఆమె స్పష్టం చేశారు. "బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు కశ్మీర్ లో కూడా ఉన్నాయి. చట్టాలతో కశ్మీర్ యువత విసిగిపోయారు. అయితే బంగ్లాదేశ్ తరహా తిరుగుబాటు కశ్మీర్ లో తలెత్తకూడదని నేను కోరుకుంటున్నాను" అన్నారు.

# దేశం గర్వపడుతుంది

## - వినేష్ ఫొగట్‌కు అండగా రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు పడింది. ఫైనల్ పోరులో పసిడి పతకం సాధిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న ఎంతోమంది భారతీయులను ఈ వార్త షాక్‌కు గురి చేసింది. ఈ క్రమంలో వినేశ్ ఫొగట్‌కు అందరూ అండగా నిలవాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు. 140 కోట్ల ప్రజల హృదయాల్లో ఫొగట్ ఛాంపియన్‌గా నిలిచారన్నారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫొగట్ అసాధారణ ప్రతిభ కనబరిచారు. తన ప్రతిభతో దేశం గర్వపడేలా చేశారు.





ఈ సమయంలో ఫొగట్‌కు అందరూ అండగా నిలవాలి. 140 కోట్ల ప్రజల హృదయాల్లో ఫొగట్ ఛాంపియన్‌గా నిలిచారు. భవిష్యత్తు క్రీడాకారులకు ఆమె ఆదర్శంగా నిలుస్తారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని అవార్డులు సాధించాలని కోరుకుంటున్నా.' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

# రేవంత్ కు అరుదైన గౌరవం



**హైదరాబాద్:** తెలంగాణలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు పలు హామీలను అమలు చేసేందుకు రేవంత్ సర్కార్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. తాజాగా రైతు రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటికే రూ. 1.50 లక్షల వరకు రుణాలు మాఫీ చేశారు. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. మరోవైపు ఇటీవలే 2024-25 సంవత్సరానికి సంబంధించిన పూర్తి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 2న ముగిశాయి. ఈ క్రమంలో తెలంగాణలోకి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఆగస్టు 3న సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. అగ్రరాజ్యంలో సీఎంకు అడుగడుగునా ఘన స్వాగతం లభిస్తోంది. తెలంగాణ ప్రాంత ఎన్నారైలు, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభిమానులు స్వాగతం పలికారు. నాలుగు రోజులు వాషింగ్టన్‌లో పర్యటించిన సీఎం అక్కడ ఎన్నారైలతో సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తెలంగాణలో ఉన్న సౌకర్యాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఈ క్రమంలో కాగ్నిజెంట్ సంస్థ హైదరాబాద్‌లో పెటు?టబడులకు ముందుకు వచ్చింది. ఈమేరకు ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. ఆయన న్యూయార్క్‌కు వెళ్లారు.అడుగు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి అభిమానులు బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్ స్క్వేర్‌పై ఆయన ఫొటోలను ప్రదర్శించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫొటోలను టైమ్ స్కే?వర్‌పై ప్రదర్శించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టైమ్ స్క్వేర్ సందర్శించేందుకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి పర్యాటకులు వెళ్తుంటారు. అలాంటి చోట రేవంత్ ఫోటోలు బిగ్ స్క్రీన్‌పై ప్రదర్శించటం అరుదైన గౌరవం అనే చెప్పాలి. ఇక అమెరికాలోని న్యూయార్క్ టైమ్ స్క్వేర్‌ను తలపించేలా హైదరాబాద్ నగరంలోనూ టీ స్క్వేర్ నిర్మించాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. మల్టీపర్పస్ హబ్ దీన్ని నిర్మించాలని డిసైడ్ అయింది. రాయదుర్గంలో డెవలప్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు టెండర్లను సైతం టీజీఐఐసీ ఆహ్వానించింది. దీని నిర్మాణంతో హైదరాబాద్ సిగలో మరో ఐకానికి ల్యాండ్ మార్క్‌ను సెట్ చేయాలని సర్కార్ యోచిస్తోంది.ఇదిలా ఉంటే.. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. పెట్టుబడల సాధనే లక్ష్యంగా ఈనెల 3న ఆయన యూఎస్ పర్యటనకు వెళ్లగా.. అక్కడ ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. పెట్టుబడుల గురించి ఫలప్రదమైన చర్చలు జరుపుతున్నారు. వి-హబ్ ప్రతినిధులు డబ్ల్యూకే హోల్డింగ్‌తో తెలంగాణలో పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారు. 5 మిలియన్ల యూఎస్ డాలర్ల పెట్టుబడికి ఆ సంస్థ అంగీకారం తెలిపింది. వి-హబ్ అనేది రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తల స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తుంది. మహిళా పారిశ్రామిక వేత్తలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది. అమెరికా పర్యటనకు వెళ్లిన తొలిరోజే ఎయిర్‌పోర్టులో అపూర్వ సాగ్వతం లభించింది. న్యూయార్క్ సిటీలో ఇటీవల రేవంత్ అభిమానులు, కాంగ్రెస్ మద్దతుదారులు భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. అమెరికా పర్యటన తర్వాత ఆయన దక్షిణ కొరియాలోనూ పర్యటిస్తారు. ఈనెల 14 తిరిగి రాష్ట్రానికి వస్తారు.

# పాదయాత్ర దీవెనతోనే ప్రజా పాలన : డిప్యూటీ సీఎం భట్టి

**అదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా పిప్రి గ్రామం నుంచి ప్రారంభమైన మహా పాదయాత్రలో ప్రజా సమస్యలు తట్టి లేపాయని, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఇందిరమ్మ రాజ్యం కల నెరవేరుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ఏడాది మార్చి 16న ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర తొలి గ్రామం పిప్రిలో బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆదివాసుల కష్టాలు, పేద ప్రజల సమస్యలు పాదయాత్రలో తమ గుండెను తాకాయని, ప్రజల ఆకాంక్షలు క్రమంగా నెరవేరుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ఆదిలాబాద్ జిల్లా పాదయాత్ర నాంది పలికిందని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, నాలుగు నెలల్లో తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కుట్టి ప్రాజెక్టుతో పాటు చనాక కొర్ట ప్రాజెక్టుకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించామని, చిక్మాన్ సాధర్మాట్ ప్రాజెక్టులను కూడా సత్వరమే పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకే పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మం వరకు విజయవంతమైందని భట్టి అన్నారు. వెయ్యి గ్రామాలు, 1600 కిలోమీటర్ల పొడవునా పాదయాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తట్టి



లేపాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వెడమ బొజ్జు, అనిల్ జా దవ్, ప్రేమ్ సాగర్ రావు, మధు యాష్ కి గౌడ్ పాల్గొన్నారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన.. 6 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్:** తెలంగాణకు భారీ వర్ష సూచన చేసింది హైదరాబాద్ వాతావరణ శాఖ. బుదవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ రోజు ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై మబ్బులు కమ్ముకుంది. అక్కడక్కడ చిరుజిల్లులు కురుస్తున్నాయి. ఇక, ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు నుంచి 3 రోజుల పాటు రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈరోజు అల్లూరి



సీతారామరాజు, విజయనగరం, బాపట్ల, కృష్ణా, పార్వతీపురం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

## కార్పొరేట్ కంపెనీలు....

# గ్రామాలకు తరలండి



**హైదరాబాద్:** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ కంపెనీలు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. చివరి వరుసలో వున్న వారి అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతగా కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ..ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరచాలని సూచించారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో మంత్రి సీతక్క, serp ceo దివ్యా దేవరాజన్, ములుగు కలెక్టర్ దివాకర్ లతో ఐటీ దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యుల్స్ ఇండియా, టీసీఎస్, ఉషా, నిర్మాన్ తదితర కంపెనీల ప్రతినిధులు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మనతో పాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో కార్పొరేట్ కంపెనీలు పని చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

ఆదిలాబాద్, ములుగు వంటి ప్రాంతాల్లో ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలు కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మార్పు చేసి చూపించాయని మంత్రి గుర్తు చేశారు. విద్య, వైద్యం,ఉపాధి, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో చేయూతనిచ్చేలా కంపెనీలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సహాయం చేస్తే గుండెల్లో పెట్టి చూసుకుంటారని పేర్కొన్నారు. ప్రజా సేవలో సంతృప్తి పొందిన వారే అసలైన శ్రీమంతులని తెలిపారు. ములుగు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను, అవసరాలను, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ దివాకర్ వివరించారు. మంత్రి పిలుపుమేరకు ములుగు వంటి నియోజకవర్గాల్లో సిఎస్ఆర్ నిధులను వెచ్చి%శీ%చేందుకు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు కంపెనీలు ముందుకు వచ్చాయి. ఆయా కంపెనీలను మంత్రి సీతక్క అభినందించారు.

## భారీ వర్షంతో భద్రాచలం

# అతలాకుతలం



**భద్రాచలం:** భద్రాచలం పట్టణంలో కురిసిన భారీ వర్షంతో పలుచోట్ల వరద నీరు నిలిచి ఇబ్బందులు తలెత్తాయి. ప్రధానంగా అయ్యప్ప కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, రామాలయం ప్రాంతంలో వరద నీరు రోడ్లపైకి వచ్చాయి. రామాలయ విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిస్ గేట్ల వద్ద ఉన్న మోటార్లను ఆరంభించకపోవడంతో, బ్యాక్ వాటర్ ఒత్తిడి పెరగటంతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. రామాలయానికి పడమర వైపు మార్గమంతా వరద నీటితో నిండిపోయింది. రామాలయ నిత్య అన్నదాన సన్నిధిలోకి కూడా నీరు చేరింది. సుమారుగా అడుగుమేర నీరు చేరటం కనపడింది. పడమర మార్గం నుంచి మిథిలా స్టేడియం వరకు వరద నీరు ఆగిపోయింది. అయ్యప్ప కాలనీలో సైతం వరద నీరు చేరగా, కాలనీవాసులు భయభ్రాంతులకు గురై సామాజిక మాధ్యమాల్లో కాలనీని కాపాడాలంటూ విన్నపం చేశారు. ఎల్ఐసి ఆఫీస్ మార్గం నుంచి ఏఎస్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో మురుగునీరు రోడ్లపైకి చేరింది. ఈ ప్రాంతంలోకి పట్నంలోని పలుచోట్ల నుంచి వచ్చే వరదనీరు, మురుగునీరు చేరుతుంది. అయితే దిగుకుకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజ్ వ్యవస్థ వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులకు, ఎమ్మెల్యేకు వినతులు అందించినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా మంత్రి తుమ్మల సైతం రాములయ్య ప్రాంతంలో బ్యాక్ వాటర్ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచల పట్టణ పరిధిలో మురుగునీటి వ్యవస్థపై శాస్త్రీయ అధ్యయనం జరగనంత వరకు ఈ సమస్య ఇలాగే ఉండనుంది.

# ప్రశాంతంగా ముగిసిన సింగరేణి ఉద్యోగ పరీక్షలు

**హైదరాబాద్:** సింగరేణి లో 327 ఎక్స్ టర్నల్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 6, 7 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. మేనేజ్ మెంట్ ట్రెయినీ( ఈ అండ్ ఎం) -42 పోస్టులకు, మేనేజ్ మెంట్ ట్రెయినీ (సిస్టమ్స్)-07 పోస్టులకు, జేఎంఈటీ-100, అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రెయినీ(మెకానికల్)-09, అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)-24, ఫిట్టర్ ట్రెయినీ-47, ఎలక్ట్రిషియన్ ట్రెయినీ-98 పోస్టులకు పరీక్షలు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో 32 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 29,291 మంది హాజరైనట్లు తెలిపారు. 84 శాతం హాజరు నమోదైందన్నారు. వారం రోజుల్లో ప్రాథమిక కీ విడుదల చేస్తామని.. దానిపై అభ్యంతరాలను స్వీకరించడానికి గడువును ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా ఫలితాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. గత నెల 20, 21వ తేదీల్లో 272 పోస్టులకు, తాజాగా 327 పోస్టులకు విజయవంతంగా పరీక్షలు నిర్వహించడంతో ఈ ఏడాది సింగరేణి ఆధ్వర్యంలో నిర్దేశించుకున్న 599 ఎక్స్ టర్నల్ పోస్టులకు సంబంధించిన పరీక్షలు పూర్తయ్యాయన్నారు. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షల సందర్భంగా పూర్తి పారదర్శకంగా బయోమెట్రిక్, ఐరిష్ పరికరాల ద్వారా అభ్యర్థుల వివరాల నమోదు, తనిఖీ చేపట్టారు. సి సి కెమెరాల నిఘా మధ్యన విజయవంతంగా పరీక్షలు నిర్వహించినట్లు బలరామ్ ప్రకటించారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎవరి ప్రమేయం ఉండదని, ఎటువంటి రికమండేషన్ లకు తావు ఉండదని కనుక సింగరేణి లో ఉద్యోగాలు ఇప్పిస్తామని. ఎవరైనా మోసగాళ్ళు మాయ మాటలు చెప్పే నమ్మి మోసపోవొద్దని, అటువంటి వారి వివరాలను సింగరేణి విజిలెన్స్ విభాగానికి, పోలీసు శాఖ దృష్టికి



తీసుకురావాలని కోరారు.

**పోస్టుల వారీగా అభ్యర్థుల హాజరు ఇలా..**

అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్) పోస్టు కు 3491 , జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టులకు 5001 మంది, ఎలక్ట్రిషియన్ ట్రెయినీ పోస్టుకు 5539 మంది, ఫిట్టర్ పోస్టుకు 3666 మంది, మేనేజ్మెంట్ ట్రెయినీ (ఈ అండ్ ఎం) పోస్టుకు 7965 మంది, మేనేజ్మెంట్ ట్రెయినీ (సిస్టమ్స్) పోస్టుకు 1708 మంది, అసిస్టెంట్ ఫోర్మెన్ (మెకానికల్) పోస్టుకు 1921 మంది హాజరయ్యారు.

## సంపాదకీయం

గురువారం, ఆగస్టు 8, 2024

# సీపీఎస్ రద్దు ఎప్పుడు..?

తాజా గణాంకాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 40 శాతానికి పైగా ఉద్యోగులు సీపీఎస్ విధానంతో నష్టపోతున్నారు. 2004 తర్వాత నియామకమైన వారంతా పాత పెన్షన్ విధానం కోల్పోయారు. వీరంతా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్నారు. ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు సీపీఎస్ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకుని వీలైనంత త్వరగా సీపీఎస్‌ను రద్దుచేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.సీపీఎస్ అనేది కేవలం ఉద్యోగి చందా అధారిత స్కీం. ఈ పథకంలో ఉద్యోగుల మూలవేతనం, డీఏల నుంచి ప్రతి నెలా 10% చొప్పున కట్ చేస్తారు. ప్రభుత్వం కూడా మరో 10% చందాను జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని ఎన్‌పీఎస్– ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తారు. అక్కడ ఉద్యోగికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాన్)లో ఈ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీనిని ఎన్ఎస్‌డీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న బ్యాంకులకు బదిలీచేసి, అక్కడినుంచి స్టాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. సీపీఎస్ ప్రకారం, ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత 60% సొమ్మును చెల్లించి, మిగతా 40% సొమ్మును స్టాక్ మార్కెట్‌లో కొనసాగిస్తూ లాభనష్టాలతో కలిసి ఎంతోకొంత పెన్షన్ రూపంలో చెల్లిస్తారు. షేర్లు నష్టాల్లో కొనసాగితే పెన్షన్ మొత్తం మైనస్‌లోకి పోతుంది. స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు, షేర్ల పెట్టుబడుల్లో ఉద్యోగులకు ఎలాంటి హక్కులు లేకపోవడంతో రిటైర్ అయిన ఉద్యోగులకు నెలకు రూ.1,800–2,000 పెన్షన్ కూడా అందడం లేదు. దీంతో రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగులకు సామాజిక భద్రత ఉండటం లేదు. సీపీఎస్‌తో ఉద్యోగులకు తీరని నష్టం కలుగుతున్నది. పెన్షన్‌పై భరోసా లేకుండా పోతున్నది. ఈ విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఉద్యోగులంతా ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్రం పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దుచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకిచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేయాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. సీపీఎస్ రద్దు నాడు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఎజెండాగా మారింది. సీపీఎస్ రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ ఉత్తర భారతానికో రూల్, దక్షిణ భారతదేశానికో రూల్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. సీపీఎస్‌ను రద్దుచేస్తామన్న హామీతోనే కాంగ్రెస్ పార్టీ గతంలో రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇదే హామీనిచ్చింది. కాంగ్రెస్ మిత్రపక్షమైన జేఎంఎం అధికారంలో ఉన్న జార?ండ్‌లోనూ ఓపీఎస్‌ను అమలుచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగులకు పాత పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు సైతం ఇచ్చారు. అయితే, దక్షిణాదిలోని కర్ణాటకలోనూ సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకూ నెరవేర్చలేదు. కానీ, ఈ రెండు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దుచేయలేదు. దీంతో ఉత్తర భారతానికి ఒక రూల్.. దక్షిణ భారతానికి ఒక రూల్ ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు? ఓపీఎస్ కింద ఉద్యోగి పదవీ విరమణ తరువాత ప్రతి నెలా సర్వీస్ పెన్షన్ అందేది. ఉద్యోగి రిటైర్ అయిన చివరి నెలలో ఉన్న వేతనంలో 50% వేతనాన్ని సర్వీస్ పెన్షన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు 2004 తర్వాత నియామకమైన వారికి సర్వీస్ పెన్షన్ అన్నదే లేదు. ఒకవేళ పెన్షనర్ చనిపోతే అతని భార్యకు, దివ్యాంగులైన పిల్లలు, పెండ్లికాని పిల్లలకు సర్వీస్ పెన్షన్ అందేది. కానీ, ఇప్పుడు ఆ వెసులుబాటు లేకుండా పోయింది. ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పెన్షన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పెన్షన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది.ప్రభుత్వం కూడా మరో 10% చందాను జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని ఎన్‌పీఎస్–ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తారు. అక్కడ ఉద్యోగికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాన్)లో ఈ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీనిని ఎన్ఎస్‌డీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న బ్యాంకులకు బదిలీచేసి, అక్కడినుంచి స్టాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ భరోసా దూరమైంది. ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పెన్షనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు. సీపీఎస్‌తో పెన్షనర్లకు ప్రభుత్వంతో ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది. పెన్షన్ కోసం స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులపైనే పెన్షనర్లు ఆధారపడాల్సి వస్తున్నది. ఇది ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది. రిటైర్మెంట్ తరువాత కమ్యూటేషన్ కింద ఒక ఉద్యోగికి ఓపీఎస్‌లో కొన్ని సంవత్సరాల మొత్తం పెన్షన్‌ను అడ్వాన్స్‌గా పొందే వీలుంటుంది. ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, పెండ్లిండ్ల కోసం అడ్వాన్స్‌లు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ వెసులుబాటే లేకుండాపోయింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి త్వరగా స్పందించి సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతున్నారు. ఓపిక నశించిన ఉద్యోగులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు నెలలో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఉద్యోగుల సహకారంతోనే తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పారు.

# రోడ్డు దుస్థితి... ఆయనను కదిలించింది...

## - అధికారులు చేయని పని ఆయన చేశారు..
## - మల్లేశం సేవను చూసి అభినందించిన గ్రామస్తులు





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** గ్రామంలోని రోడ్ల దుస్థితిని చూసి ఆయనను కదిలించింది. అధికారులు సైతం చేయని పని ఆయన చేసి గ్రామస్తులతో శభాష్ అనిపించుకున్నాడు. రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట గ్రామ ప్రధాన కూడలి నుండి బూరుగుపల్లి కి వెళ్లే రోడ్డు గత కొద్ది సంవత్సరాలుగా చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ పెద్దపెద్ద గుంతల మయమై చెరువును తలపించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గత కొద్ది నెలల నుండి సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రశ్నించగా దానికి గ్రామానికి చెందిన కుడిత్యాల మల్లేశం స్పందించి మానవతా దృక్పథంతో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలలో మట్టిని పోయించి జెసిబి తో చదును చేయించారు. ఈ సందర్భంగా రోడ్లకు మరమ్మత్తులు చేసిన మల్లేశంను గ్రామస్తులు సోషల్ మీడియా వేదికగా అభినందించారు. రోడ్ల మరమ్మత్తులు చూసి వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజులలో అధికారులు సైతం వారు చేయాల్సిన కనీస కర్తవ్యాన్ని మరిచారని ఈ ఫోటోను చూస్తే కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది.

# దాతల సాకారం.....
# ఆలయాల నిర్మాణానికి శ్రీకారం

- ఆలయాల పునర్నిర్మాణానికి గ్రామస్తుల ముందడుగు
- ఆదర్శంగా నడుస్తున్న గోపాలరావుపేట గ్రామం
- ప్రభుత్వం అండగా నిలివాలని వేడుకోలు






**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** ఆ గ్రామంలో మొట్టమొదటిసారిగా వెలిసిన, నిర్మించిన ఆలయాలు శిధిలావస్థకు చేరడంతో ఒక్కసారిగా ఆ గ్రామస్తుల దృష్టి ఆలయాల పునర్నిర్మాణం పై పడింది. చేయి చేయి కలిపి దేవాలయాల పునర్నిర్మాణానికి పూనుకున్నారు. దీనికి తోడుగా దాతలు మేమున్నామంటూ దేవుళ్ళ అనుగ్రహం కోసం ఆలయాల అభివృద్ధికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. మండలం మొత్తంలో అన్ని గ్రామాలకు ఈ గ్రామం ఇప్పుడు ఆదర్శంగా నిలవబోతుందని చెప్పక తప్పడం లేదు.

**- అసలు కథ ఇదే........**

రామడుగు మండలం లోని గోపాల్ రావు పేట గ్రామంలోనీ నల్ల పోచమ్మ, ఊరి పోచమ్మ, గ్రామపంచాయతీ ఆనుకుని ఉన్న హనుమాన్ దేవాలయాలు శిధిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల దృష్టి ఒక్కసారిగా వాటి వైపు వెళ్ళింది. దీంతో ఆలయాల పునర్నిర్మాణం చేపట్టాలని పూనుకున్నారు. ఆలయాల నిర్మాణానికి గ్రామంలోని అన్ని కుల సంఘాల నాయకులను ఏకం చేస్తూ ఒక కమిటీగా ఏర్పడి జూన్ 1వ తేదీన హరి మౌనస్వామి రోటి గూడెం ఆధ్వర్యంలో ఆలయాల చుట్టూ హద్దులు ఏర్పాటు చేసి ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి అన్ని కుల సంఘాలను ఏకం చేస్తూ ఒక కమిటీగా ఏర్పడి దాతల సహకారంతో దేవాలయాల పునర్నిర్మానం చేపడుతున్నారు. ఈ గ్రామస్తుల సమిష్టి కృషి చూసి సమీప గ్రామస్తులు సైతం ఔరా అంటున్నారు. ఇట్టి దేవాలయాల పునర్నిర్మానాలు గ్రామంలో చేపడుతుండడంతో పక్క గ్రామాలకు గోపాల్ రావు పేట గ్రామం ఆదర్శంగా నిలుస్తుందనే చెప్పాలి. దీనికి గ్రామంలోని యువజన సంఘాలు విరాళాలు సేకరించడంలో కీ రోల్ పోషిస్తున్నాయి. మరి ఇంతటి పెద్ద కార్యక్రమం చేపడుతున్న ఈ గ్రామ దేవాలయాల నిర్మాణాలకు ప్రభుత్వం కూడా చేయూతనివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరి ఇంతటి మహత్తర కార్యక్రమం ముందు వేసుకున్న ఈ గ్రామస్తులను సోషల్ మీడియా వేదికగా అభినందిస్తున్నారు. మరికొద్ది నెలల్లో దేవాలయాల పునర్నిర్మాణాలతో గ్రామ రూపురేఖలు మారుతున్నట్లు తెలుస్తుంది.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టై, బెల్ట్, షూస్, ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులతో పాటు దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఐఐఐటి బాసరలో సీటు పొందిన నేరేడుపల్లి పాఠశాలకు చెందిన మారెపల్లి అక్షితకు ఎమ్మెల్యే శాలువా కప్పి, పూల బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు టై, బెల్ట్, షూస్, ఐడి కార్డులను పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్కూల్లో ఎమ్మెల్యే డీపీవో నారాయణ రావు ఇతర అధికారులు, నాయకులతో కలిసి మొక్కలను నాటారు.



# చేనేత కార్మికులను సత్కరించిన శ్రీ ప్రగతి పాఠశాల విద్యార్థులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట శ్రీ ప్రగతి పాఠశాలలో బుధవారం చేనేత కార్మికులకు విద్యార్థులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న ఏడవ తరగతి విద్యార్థులు మండలంలోని రామచంద్రపురం గ్రామంలో చేనేత వృత్తి చేసుకుంటున్న కార్మికుల పవర్లూమ్ ని సందర్శించి చేనేత వస్త్రాలు ఏ విధంగా తయారు చేస్తారు, అలాగే పని చేసే విధానం ను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# స్వచ్ఛతనం పచ్చదనం పనుల పరిశీలన



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మూడవరోజు రామడుగు మండలంలోని వెదిర గ్రామంలో మండల ఎంపీడీవో రాజేశ్వరి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరితహారం లో భాగంగా 4 వందల మొక్కలను నాటారు. అలాగే సమీపంలోని పశు వైద్యశాలను సందర్శించారు. గ్రామంలోని రోడ్డుపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, తాసిల్దార్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి సామల సదాశివ!



ఎక్కడో దూరంగా సభ్య సమాజానికి బహు దూరంగా, విద్యాగంధం అంతగా సోకని, అభివృద్ధి అంటే తెలియని మారుమూల ప్రాంతంలో పురుడు పోసుకుని, స్వయం కృషితో, తెలంగాణ కవుల్లో కాళోజీ తర్వాత అంతటి గుర్తింపు తెచ్చుకున్న అసమాన ప్రతిభ గల సాహితీవేత్త సామల సదాశివ. సాహిత్యంలోనే కాక సంగీతం, చిత్రలేఖనంలో కూడా అపారమైన ప్రతిభను, బహు భాషల్లో ప్రావీణ్యం కలిగిన ప్రతిభాశాలి. ఉర్దూ, పార్శీ, మరాఠీ, హింది సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించారు. తెలుగు తీయదనాన్ని ఉర్దూ వారికి, ఉర్దూ నుడికారపు మాధుర్యాన్ని తెలుగువారికి రుచి చూపించిన గొప్ప అనువాదకుడు. సదాశివ రాసిన విమర్శనా వ్యాసాలు పలు తెలుగు, ఉర్దూ పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా ప్రచురితం అయ్యాయి. హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా ఎన్నో ప్రసంగాలు ప్రసార మైనాయి. ఏడవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో గిరిజన వీరుడు కొమురంభీం పాఠాన్ని రాసి తెలుగువారికి భీంను పరిచయం చేశారు. "కొమురం భీము" సినిమా నిర్మించిన అల్లాని శ్రీధర్... "సదాశివ గారికి కృతజ్ఞతలతో".. అని రాసి తమ అభిమానాన్ని చాటు కున్నారు. సామల సదాశివ (మే 11, 1928 – ఆగష్టు 7, 2012) కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. తెలంగాణకు చెందిన తెలుగు, ఉర్దూ రచయిత, హిందుస్తానీ సంగీత పండితుడు. హిందుస్తానీ సంగీతాన్ని తొలిసారిగా తెలుగు పాఠక లోకానికి పరిచయం చేసిన తొలి తెలుగు రచయిత. సామల సదాశివ దహెగాం మండలంలో తెనుగుపల్లెలో 1928, మే 11న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సామన నాగయ్య పంతులు, చిన్నమ్మలు. ఎంఏ, బీఎడ్, డీ లిట్ చదివారు. సదాశివ ఉపాధ్యాయునిగా తొలుత కాగజ్ నగర్లోలోవిధులు నిర్వర్తించారు . ఆయన శిష్యులు ఈనాటికీ మాస్టారు అని గౌరవంగా చెప్పుకుంటారు. డైట్ కళాశాల, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. సంస్కృత పండితులు కప్ప గంతుల లక్ష్మణ శాస్త్రి గారి వద్ద వ్యాకరణాంశాలు నేర్చుకొని గొప్ప పండితునిగా వాసి కెక్కారు. వేలూరి శివరామశాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, డాక్టర్ దాశరథి. డాక్టర్ గోపి వంటి పండితులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సదాశివను గురువుగా గౌరవించేవారు. సదాశివ ఎప్పుడు వరంగల్ వెళ్లినా, జయశంకర్ ఇంట్లోనే అతిథిగా ఉండేవారని మాస్టారు యాది పుస్తకంలో పేర్కొన్నారు.







విజయ్‌సేతుపతి, ఫహాద్ ఫాజిల్, సమంత ముఖ్యపాత్రల్లో నటించిన 'సూపర్‌డీలక్స్' చిత్రం తమిళంలో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. కుమార రాజా దర్శకత్వం వహించారు. నాలుగు కథల సమాహారంగా రూపొందించిన ఈ చిత్రాన్ని ఈ నెల 9న తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సినిమాలో విజయ్‌సేతుపతి ట్రాన్స్‌జెండర్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన పాత్రకు మంచి ప్రశంసల దక్కాయి. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కూడా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి యువన్‌శంకర్ రాజా సంగీతాన్నందించారు. నిర్మాతలు: దైవసిగమణి, తీర్థమలై, పూల మధు.

# ధనుష్ జోడీగా...



కథాంశాల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నది బాలీవుడ్ కథానాయిక కృతిసనన్. యాక్షన్ చిత్రాలతో పాటు లవ్‌స్టోరీస్‌కు ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. ధనుష్ కథానాయకుడిగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో 'తేరే ఇష్క్ మే' పేరుతో ఓ సినిమా తెరకెక్కనుంది. 'రాంజనా' (2013) తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న ఈ సినిమా బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ చివరకు కృతిసనన్‌ను ఖరారు చేశారని సమాచారం. 'రాంజనా' తరహాలోనే హృద్యమైన ప్రేమకథాంశం కావడంతో కృతిసనన్ వెంటనే ఈ సినిమాకు ఓకే చెప్పిందట. అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు.

# పద్ధతైన పారిజాత పువ్వు



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ధూం ధాం'. సాయికిశోర్ మచ్చా దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. గోపీమోహన్ కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న ఈ చిత్రం వచ్చేనెలలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ వేగవంతం చేశారు. ఇప్పటికే విడుదలైన మూడు పాటలు శ్రోతల్ని అలరిస్తున్నాయని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. బుధవారం ఇందులోని నాలుగో పాటను దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. 'అందమైన కుందనాల బొమ్మారా.. అన్నమయ్య కీర్తనల్లే ఉందిరా.. పద్ధతైన పారిజాత పువ్వురా.. నేనంటే ఇష్టమంటోందిరా..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, గోపీసుందర్ స్వరపరిచారు. శ్రీకృష్ణ ఆలపించారు. రామజోగయ్యశాస్త్రి సాహిత్యం ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సాయికుమార్, వెన్నెలకిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి.